అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, నవంబర్ 22 : ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు చేపడుతామని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం ఆయన ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఎఫ్ఏక్యూ నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని అన్నారు. నాణ్యతాప్రమాణాల విషయంలో అధికారులు అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని అన్నారు. నాణ్యతాప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు. అనంతరం జిల్లాలో పామాయిల్ సాగుపై వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐదు ఎకరాలకు పైగా భూమి ఉన్న రైతులకు పామ్ ఆయిల్ సాగు వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించి సాగు దిశగా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, సివిల్ సప్లై డీఎం రాంపతి, డీసీవో సర్దార్ సింగ్, డీఏవో తేజోవతి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

- వారానికి మూడు సార్లు వసతి గృహాలను పరిశీలించండి
- అధికారులతో భూపాలపల్లి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 22 : సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎండీవోలను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం నుంచి ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలకు సరఫరా అవుతున్న బియ్యం, సరుకుల నాణ్యతను పరిశీలించాలని, చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా వేడి నీటి సదుపాయం కల్పించాలన్నారు. ఆర్‌వో ప్లాంట్ల పనితీరును పరిశీలించాలని, సురక్షిత మంచినీరు అందించాలని సూచించారు. నిత్యావసర సామగ్రి నాణ్యతను కచ్చితంగా పాటించాలని తెలిపారు. వారానికి కనీసం మూడుసార్లు వసతి గృహాలను పరిశీలించాలని, నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. ప్రతి శుక్రవారం ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన సౌకర్యాలు కూడా తనిఖీ చేయాలన్నారు. తనిఖీలు నిర్వహించి సోమవారం నాటికి సమగ్ర నివేదికలు అందజేయాలని అధికారులకు సూచించారు. ఈడీఎం నివేదికలు సేకరించాలన్నారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఈడీఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గడువు దాటిన పదార్థాలు విక్రయించొద్దు

జిల్లా ఆహార భద్రత అధికారి రోహిత్‌రెడ్డి

కృష్ణకాలనీ, నవంబర్ 22: కిరాణా షాపులు, సూపర్ మార్కెట్ల యజమానులు గడువు దాటిన పదార్థాలు విక్రయించొద్దని జిల్లా ఆహార భద్రత అధికారి రోహిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లలో టీ పొడర్‌తో పాటు ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించామన్నారు. గడువు దాటిన ప్యాకెట్లను వెంటనే తీసివేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే హోటల్య జమానులు వంట గదిని శుభ్రంగా ఉంచాలని, మాంసాన్ని ఎప్పటికప్పుడు తీసుకొచ్చి వండాలన్నారు. ఫ్రిజ్‌లో మాంసం నిల్వ ఉంచి వండితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఆరోగ్యంగా ఉన్న సిబ్బందిని మాత్రమే హోటళ్లలో పని చేయించాలన్నారు.

28న సింగరేణిలో స్ట్రక్చర్ మీటింగ్

భూపాలపల్లి రూరల్, నవంబర్ 22 : ఈనెల 28న నిర్వహించనున్న స్ట్రక్చర్ మీటింగ్‌లో కార్మిక సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచి కార్యదర్శి మోటపలుకుల రమేశ్ తెలిపారు. శుక్రవారం కేటీకే-5 ఇంక్లైన్ ఫిట్ సెక్రటరీ దొర్నాల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో బ్రాంచి కార్యదర్శి రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై స్ట్రక్చర్ మీటింగ్‌లో నిర్వహించే సమస్యలపై కార్మికులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా గెలవడంతోనే స్ట్రక్చర్ మీటింగ్ నిర్వహించి కార్మిక సమస్యలను పరిష్కరించబోతున్నామని, జేబీసీసీకి సంబంధం లేకుండా ఇచ్చే అలవెన్స్‌లు కార్మికులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్మికుల పిల్లలకు మెరిట్ స్కాలర్షిప్‌లు ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. డిస్మిస్డ్ కార్మికులను కూడా ఉద్యోగంలోకి తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ ఆసిఫ్ పాషా, పీ నారాయణ, మూర్తి, వై ప్రకాశ్, శ్రీకాంత్, అఖిల్, ఎన్ సత్తి, వీ రాజేందర్, బీ రాయమల్లు, ఎం సుధాకర్, సీహెచ్ రామచందర్, రాజు, ప్రవీణ్, పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికే చర్చా వేదికలు

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మాట్లాడుతున్న రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

భూపాలపల్లి రూరల్, నవంబర్ 22 : విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకే జిల్లాల్లో చర్చా వేదికలు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో రాష్ట్ర సమగ్ర విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాలతో చర్చా, సూచనలు, సలహాల స్వీకరణ కార్యక్రమంను మురళి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా కమిషన్ పదవీ బాధ్యతలు చేపట్టి రెండు నెలలు అయిందని, ఇప్పటి వరకు 70 సమావేశాలు నిర్వహించామన్నారు. టీచర్స్, లెక్చరర్స్, యూనివర్సిటీ ఫ్యాకల్టీలతో పాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నట్లు తెలిపారు. పర్యటనల్లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు కేంద్రీయ విద్యాలయాలు, యూనివర్సిటీలు, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీలను సందర్శిస్తున్నామన్నారు. దేశంలో ప్రతి రెండు మూడేళ్లకోసారి చేసే సర్వేల్లో విద్యా విధానంలో మన రాష్ట్రం ర్యాంకు 32వ స్థానంలో ఉందని తెలిపారు. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వానికి ఒక పాలసీ అందజేశామన్నారు. రాష్ట్రంలో గద్వాల జిల్లా చాలా వెనుకబడి ఉందని, అందుకే అక్కడ నుంచే చర్చా వేదికలు ప్రారంభించామని, తరువాత స్థానాల్లో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయన్నారు. అందుకనే వెనుకబడిన ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న మొత్తం 541 పాఠశాలల్లో 46,862 మంది విద్యార్థులు విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. ప్రైవేట్ యాజమాన్యంలో నడిచే పాఠశాలలు 68 ఉన్నాయని, వీటిలో 20,955 మంది విద్యార్థులు చదువుతున్నట్లు చెప్పారు. 223 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయని వివరించారు. మహదేవపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సాయి ప్రదీప్తిక, అన్విత కళ్లతో చేసిన ప్రదర్శనను వీక్షించిన చైర్మన్, కలెక్టర్, కమిటీ సభ్యులు అభినందించారు. ఈ చర్చా వేదికలో విద్యా కమిటీ సభ్యులు జ్యోత్స్నారెడ్డి, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, డీపీఆర్వో శ్రీనివాస్, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునీత, శైలజ పాల్గొన్నారు.

ఓటరు సెల్ఫీ పాయింట్ ప్రారంభం

ములుగురూరల్, నవంబర్ 22 : ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఆవరణలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి, అదనపు కలెక్టర్ సంపత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు సెల్ఫీ పాయింట్‌ను కలెక్టర్ టీఎస్ దివాకర శుక్రవారం ప్రారంభించారు. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18యేళ్లు నిండిన యువతీయువకులు ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం సతీశ్, ఎన్నికల కార్యాలయ సూపరింటెండెంట్ సలీమ్, డీపీఆర్వో రఫిక్, అధికారులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో అలసత్వం వహించవద్దు

ములుగురూరల్, నవంబర్ 22 : పీహెచ్‌సీలో పనిచేస్తున్న వైద్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహించవద్దని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన ములుగు, దేవనగర్ సబ్ సెంటర్లను, రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. ప్రభుత్వ దవాఖానలకు వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

జాతీయ స్థాయి పోటీలకు కాటారం విద్యార్థి

కాటారం, నవంబర్ 22 : జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ అండర్-14 పోటీలకు కాటారం గురుకులం విద్యార్థి బీ దేవేందర్ ఎంపికయ్యాడు. ఈనెల 8 నుంచి 10 వరకు సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో వరంగల్ జట్టు తరపున దేవేందర్ పాల్గొని అత్యంత ప్రతిభ కనబరిచాడు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వరంగల్ ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి దస్రు, జిల్లా కార్యదర్శి రమేశ్ తెలిపారు. ప్రిన్సిపాల్ బీ బాబు, వైస్ ప్రిన్సిపాల్స్ రాజేందర్, మాధవి, పీడీ మహేందర్, పీఈటీ శ్రీనివాస్, కోచ్ వెంకటేష్ విద్యార్థి దేవేందర్‌ను అభినందించారు.

ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే : జీఎం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 22 : భూపాలపల్లి సింగరేణి పర్సనల్ మేనేజర్ కార్యాలయంలో ప్రతి శుక్రవారం సాయంత్రం 4నుంచి 5 గంటల వరకు గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు భూపాలపల్లి సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియాలో పనిచేసి దిగిపోయిన ఉద్యోగులు కారుణ్య నియామకాలు, హెల్త్ కార్డ్‌లు, లైఫ్ సర్టిఫికేట్, సీఎంపీఎఫ్, గ్రాట్యుటీ తదితర సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం సాయంత్రం గ్రీవెన్స్ డేలో దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

కాటారం, నవంబర్ 22 : మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర హాస్టల్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య నిర్వహించారు. విద్యార్థులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌పీహెచ్ డాక్టర్ సుమన్, హెచ్ ఈవో తిరుపతిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ టీఎస్ దివాకర

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గోవిందరావుపేట, నవంబర్ 22 : కార్పొరేట్ సంస్థ ప్రతినిధులకు గ్రామాల్లోని సమస్యలు తెలిపేందుకు అధికారులు ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎల్బీనగర్, మాన్యతండాలను సందర్శించి అధికారులతో మాట్లాడారు. శనివారం 50 కార్పొరేట్ సంస్థ ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించనున్నారని, అందుకు తగిన విధంగా అధికారులు గ్రామసభలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సృజన్ కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, ఎంపీవో శరత్, జీపీ సెక్రటరీ స్వర్ణ ఉన్నారు.

'ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడం సమంజసం కాదు'

మంగపేట, నవంబర్ 22 : మండలకేంద్రంలో చేపట్టబోయే అంబేద్కర్ విగ్రహావిష్కరణ విషయంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మాదిగ సామాజిక వర్గాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని పలువురు మాదిగ సామాజికవర్గ నాయకులు వాపోయారు. ఈ మేరకు వారు శుక్రవారం మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహానికి చెందిన శిలాఫలకంపై డబ్బులు ఇచ్చిన వారి పేర్లను మాత్రమే పెడతామని ప్రచారం చేయడాన్ని వారు తప్పుబట్టారు. కరపత్రాల్లో కూడా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారి పేర్లు పెట్టక పోవడమేంటని ప్రశ్నించారు. ఇది తమ జాతికి అవమానకరమన్నారు. మండలకేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద మరో అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టడానికి తీర్మానించారు. సమావేశంలో ఎంపల్లి మల్లేశ్‌మాదిగ, పరికి శ్రీను మాదిగ, లంజపెల్లి రవిమాదిగ, చందర్‌రావు, గుగ్లిళ్ల సురేశ్, యాసం హరీశ్, ఈసంపెల్లి సురేందర్, గుగ్లిళ్ల నరసింహారావు, గాజర్ల రాజు మాదిగ, పాలమాకుల సోమనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని వినతి

ఏటూరునాగారం, నవంబర్ 22 : మూడు నాలుగు నెలల నుంచి వెంకటాపురం(నూగూరు) మండలంలోని ముత్తారం గిరిజన ప్రభుత్వ పాఠశాలకు ఉపాధ్యాయులు రావడం లేదని, ఏటూరునాగారం మండలంలోని కొండాయి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యం సేవించి వస్తున్నందున విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం(టీఏవీఎస్), ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం ఐటీడీఏలోని డీడీ పోచంకు వినతిపత్రం అందజేశారు.

కార్యక్రమంలో టీఏవీఎస్ జిల్లా నాయకుడు సోడి అశోక్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ మాట్లాడుతూ పాఠశాల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని అన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

కాటారం, నవంబర్ 22: కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని గారెపల్లిలో రజక వాడకు చెందిన పున్నం సతీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా శుక్రవారం మాజీ ఎంపీటీసీ తోట జనార్దన్ పరామర్శించారు. వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు పసుల శంకర్, ఇప్పలపల్లి దేవేందర్, పైడాకుల మహేందర్, రాజబాబు, పున్నం మహేశ్, రాహుల్ ఉన్నారు.

25న శివపార్వతుల కల్యాణం

గణపురం, నవంబర్ 22: మండలకేంద్రంలోని కాకతీయుల ఆలయం రెడ్డిగుడి నాగలింగేశ్వరస్వామి దేవాలయంలో 25న శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం గ్రామ పెద్దలతో కలిసి వారు కల్యాణ పత్రిక, గోడ పత్రికను ఆవిష్కరించారు. సాయంత్రం 6 గంటలకు కల్యాణం జరుగుతుందని, అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 26న గ్రామ పురవీధుల్లో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉందన్నారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రావుల సురేశ్, మోటపోతుల రాజన్న, మాజీ ఎంపీటీసీ మోటపోతుల శివశంకర్, మాజీ సర్పంచ్ నారగాని దేవేందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆలయంలో మంటలపై విచారణ జరపాలి'

మహదేవపూర్, నవంబర్ 22 : మండలంలోని అంబట్‌పల్లి అమరేశ్వర ఆలయ ఆవరణలోని హనుమాన్ టెంపుల్‌లో ఆకస్మాత్తుగా వచ్చిన మంటలపై విచారణ జరిపించాలని భజరంగ్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు శివరామ్, కరీంనగర్, వరంగల్ జిల్లాల కోకన్వీనర్ శ్యాం లాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఆలయాన్ని సందర్శించి ఘటనపై ఆరా తీశారు. సమగ్ర విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతినేలా చేసిన ఘటనను నిరసిస్తూ మండల బజరంగ్ దళ్ మండల ప్రఖండ శీలం మధుకర్ మండల బండ్‌కు పిలుపునిచ్చారు. ఘటనపై ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కాటారం డీఎస్పీ విచారణ చేపట్టారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జోగేశ్వర్ రావు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

పంచాయతీ కార్యదర్శి హత్యపై నిరసన

మంగపేట, నవంబర్ 22 : పేరూరు పంచాయతీ కార్యదర్శి ఉయికె రమేశ్‌ను మావోయిస్టులు ఇన్‌ఫార్మర్ నెపంతో హత్యం చేయడంపై మంగపేట మండల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా నిత్యం ప్రజలతో మమేకమై గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న ఓ చిరు ఉద్యోగిని హతమార్చడం అన్యాయమని విచారం వ్యక్త పరిచారు. నిరసనలో మండలంలోని 25గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన పూజ

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 22 : మండలకేంద్రంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లక్ష బిల్వార్చన పూజలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

పశు వైద్య శిబిరం

వెంకటాపూర్, నవంబర్ 22 : మండలంలోని చక్రవర్తిపల్లి గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని లక్ష్మీదేవిపేట పశువైద్య అధికారి డాక్టర్ మహితి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ జగపతిరావు హాజరై మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ వలన కలిగే లాభాలను, గర్భధారణ రేటు పెంచడానికి సూచనలు తెలిపారు. ఈ శిబిరంలో 99పుశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 45దూడలకు నట్టల నివారణ మందు, 124పశువులకు గర్భస్థ వ్యాధి నివారణ మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ ఏ అయిలుమల్లు, గోపాలమిత్రులు రాజేందర్, దామోదర్, శ్రీనివాస్, ఆలేషా, పుశువైద్య సిబ్బంది వేణు, తేజ వర్మ పాల్గొన్నారు.

కుటుంబ సర్వే ఆన్‌లైన్ డేటా ఎంట్రీపై శిక్షణ

మహదేవపూర్, నవంబర్ 22: మండలకేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో కంప్యూటర్ ఆపరేటర్లు, ఎన్యుమరేటర్లకు శుక్రవారం ఆన్‌లైన్ డేటా ఎంట్రీపై శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి ఆపరేటర్ వారికి కేటాయించిన డేటా ఎంట్రీ సెంటర్‌లో ప్రతి రోజూ సుమారు 25 సర్వే ఫారాలు నమోదు చేయించాల్సి ఉంటుందన్నారు. ఆ సమయంలో సంబంధిత ఎన్యుమరేటర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఆపరేటర్ పక్కన ఉండి తప్పులు లేకుండా డేటా నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఎస్‌వో శివకృష్ణ, తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, సూపర్‌వైజర్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

కాటారం, నవంబర్ 22 : స్వయం కృషి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దేవరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మక్తలు నవీన్‌రావు, గద్దె సమ్మిరెడ్డి, వంశవర్ధన్‌రావు, స్వయంకృషి ఫౌండేషన్ కొట్టె సతీశ్ మాట్లాడుతూ విద్యార్థులే దేశానికి పట్టుకొమ్మలు అన్నారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. గ్రామస్తులు గుడిపాటి రమేశ్‌రెడ్డి, వెంకటరెడ్డి, కామిడి శ్రీను, అనంతుల శ్రీను, మిర్యాల శ్రీను, రాజిరెడ్డి, కాల్వపెల్లి బుచ్చయ్య, దోమ భాస్కర్, గద్దె దేవేందర్, సంస్థ సభ్యులు సుమన్, అఖిల్, సాయి, రవి, వేణు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌనిక

చిట్యాల, నవంబర్ 22 : విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు రాగళ్ల మౌనిక సూచించారు. ప్రపంచ యాంటీ మైక్రోబయల్ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ వైద్యుల సలహా మేరకు మాత్రమే యాంటీ బయాటిక్స్ మందులు వాడాలని, ఎవరూ సొంతగా వాడొద్దన్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. హెచ్ఈవో సంజీవరెడ్డి, ఏఎన్ఎంలు సుమలత, జయలతలు, ఆశ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ములుగురూరల్, నవంబర్ 22 : ఈ నెల 16న మండలంలోని జాకారం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఇద్దరు గీత కార్మికులకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన శ్రీరాములపల్లికి చెందిన ఉయ్యాల బాబు(50) అనే గీతకార్మికులు చికిత్స పొందుతూ హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో గురువారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. బాబు మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, నిరుపేద అయిన బాబు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

బైక్‌ను ఢీకొన్న కారు

కృష్ణకాలనీ, నవంబర్ 22: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో బైక్‌పై వెళ్తున్న వృద్ధురాలికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పరకాల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు అంబేద్కర్ కూడలిలో రెడ్ సిగ్నల్ పడడంతో అక్కడే ఆగి గ్రీన్ సిగ్నల్ పడటంతో వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వృద్ధురాలు కింద పడడంతో ఆమె తలకు గాయాలయ్యాయి. అక్కడే ఉన్న ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై భూపాలపల్లి పోలీసులను వివరణ కోరగా ఇప్పటివరకు తయారే ఫిర్యాదు రాలేదని తెలిపారు.

దుకాణంలో చోరీ

ములుగురూరల్, నవంబర్ 22 : ములుగు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లోని ములుగుకు చెందిన దండు శంకర్ దుకాణంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడు శంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం రాత్రి యథావిధిగా షాపును మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు రాగా గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్డు సాయంతో తాళాలు పగలగొట్టారని తెలిపాడు. షాపులోకి వెళ్లి చూడగా గల్లాపెట్టలో నగదుతోపాటు సిగరేట్ పెట్టెలు పెద్ద మొత్తంలో చోరీకి గురైనట్లు తెలిపాడు. గుర్తు తెలియని వ్యక్తులు ఇనుపరాడ్డు సాయంతో తాళాలు పగులగొట్టారని అన్నారు. ఈ చోరీలో తనకు సుమారు రూ.15వేల నష్టం జరిగిందని తెలిపారు. కాగా, ములుగు డీఎస్పీ, సీఐ కార్యాలయాలకు ఎదురుగా చోరీ జరగడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు.

మృతుడి కుటుంబానికి చేయూత

చిట్యాల, నవంబర్ 22 : చల్లగరిగె గ్రామానికి చెందిన చర్లపల్లి రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య రజి తతోపాటు చదువుకున్న 2008 టెన్త్ బ్యాచ్‌కు చెందిన మిత్రులు రూ.15వేలు శుక్రవారం అందజేశార